17న కానిస్టేబుల్స్‌కు వర్క్‌షాపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలీస్ కానిస్టేబుల్స్, ఎస్ఐ నియామకాల్లో పాల్గొనే అభ్యర్థులకు పోలీస్‌శాఖ ఈనెల 17వ తేది నుండీ సంతలపేటలోని ఆర్ఆర్ గార్డన్స్‌లో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ నుంచి నిర్వహించాలని భావించినా తుపాను కారణంగా ఈనెల 17వ తేదీకి మార్చిన్నట్లు పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 9 గంటలకు అభ్యర్థులు ఆర్ఆర్ గార్డన్స్‌కు చేరుకోవాలని సూచించారు.

చిత్తూరు విజయ డెయిరీ అమూల్ పరం

- **99 సంవత్సరాల లీజుకు**
- **వృద్ధుల పెన్షన్ రూ.2750కి పెంపు**
- **క్యాబినెట్లో ఆమోదం**

చిత్తూరు విజయ డెయిరీ

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి: ఎన్నోఏళ్లగా సేవలందించి పాలకుల స్వార్థ రాజకీయాలకు బలైన చిత్తూరు విజయ పాల డెయిరీ ఈసారి ఆఖరికి అమూల్ డెయిరీ పరం కానుంది. అలాగే ఇది వరకు వృద్ధులకు ఇస్తున్న సామాజిక పింఛన్ రూ.2500 నుంచి 2750లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇలా పలు అంశాలకు సంబంధించి మంగళవారం జరిగిన క్యాబినెట్లో సమావేశంలో ఆమోదముద్ర వేశారు. వచ్చే ఏడాది జనవరి నుంచి వృద్ధుల పెన్షన్ రూ.2750లకి పెన్షన్ ఉంది. దీన్ని జనవరి నుంచి అందివ్వనున్నట్లు క్యాబినెట్ ప్రకటించింది. దీనివల్ల మన జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మందికి లబ్ధి కలగనుంది.

పాఠశాల విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ఫేజ్-1లో పనులు పూర్తయిన స్కూళ్లలో అత్యాధునిక బోధన ఉపకరణాలు ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం. హైస్కూల్స్ పరిధిలో ప్రతితరగతి గదిలో ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ), ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ స్కూళ్లలో స్మార్ట్ టీవీ రూమ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం. 6 వతరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిగతిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రతి స్కూల్లో ఒక టీవీ ఏర్పాటు. పదివేల స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదించింది. ప్రభుత్వ స్కూళ్లలో 8వతరగతి విద్యార్థులకు 24 గంటలపాటు ఉపయోగపడే విధంగా ట్యాబులు, ఇంకంటెంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చే కార్యక్రమాన్ని 21 డిసెంబరు నాడు లాంఛనంగా ప్రారంభించనున్న ప్రభుత్వం. 8వతరగతి చదువుతున్న విద్యార్థులతో పాటు బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా శామ్‌సంగ్ ట్యాబులు పంపిణీ. ఇంటర్‌నెట్ కనెక్షన్ లేకపోయినా, ట్యాబును ఇంటిలో కూడా వినియోగించుకునేలా, ఆఫ్‌లైన్‌లో కూడా కంటెంట్ అందుబాటులో ఉండేలా సెక్యూర్ డిజిటల్ కార్డుతో బైజూస్ సంస్థ కంటెంట్‌తో ట్యాబ్ లు ఇవ్వనుంది.

చిత్తూరు జిల్లా సదుంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 30పడకల సామర్థ్యం నుంచి 50 పడకల సామర్థ్యానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా 18 అదనపు పోస్టుల భర్తీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(తుడా)లో ఎస్ఈ పోస్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూమిని కేటాయించాలన్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్(సీపీఆర్ఓ) నియామకానికి కేబినెట్ ఆమోదం.

రాయలసీమ జిల్లాల్లో మరోసారి పాలవిప్లవం

గతంలో మూసివేతకు గురైన చిత్తూరు డెయిరీని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు. అమూల్ ద్వారా మళ్లీ చిత్తూరు డైయిరీ కార్యకలాపాలు. చిత్తూరుతో పాటు రాయలసీమ జిల్లా పాడి రైతులకు మేలు చేకూరేలా.. అతిపెద్ద సహకార డెయిరీ అయిన అమూల్ ద్వారా మరలా చిత్తూరు డెయిరీ కార్యకలాపాలు.

గతంలో మూసివేతకు గురైన చిత్తూరు డెయిరీ భూములను 99 ఏళ్లపాటు అమూల్‌కు లీజు ఇస్తూ రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం. ఏటా రూ.1 కోటి ప్రభుత్వానికి లీజు రూపంలో ఆదాయం వస్తుందని క్యాబినెట్ తెలిపింది.

పంట నష్టాల అంచనాలు సిద్ధం

- **1404 ఎకరాల్లో వ్యవసాయ**
- **735 ఎకరాల్లో ఉద్యాన పంటలు నష్టం**
- **ప్రాథమిక జాబితా తయారు చేసిన అధికారులు**

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి: **మాండూస్ తుపాన్ నేపథ్యంలో జిల్లాలో జరిగిన పంట నష్ట వివరాలను అధికారులు సిద్ధం చేశారు. ప్రాథమిక అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇందులో భాగంగా జిల్లాలో 144 ఎకరాల్లో వ్యవసాయ 735 ఎకరాల్లో ఉద్యాన పంటలు నష్టపోయినట్లు అంచనాకు వచ్చారు. ఈ మేరకు రెండు శాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీని ఆధారంగా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు.**

రెండు రోజుల క్రితం మాండూస్ తుపాను కొంతమేరకు జిల్లాలో ప్రభావాన్ని చూపించిన విషయం విధితమే. జిల్లా వ్యాప్తంగా మాస్టర్ నుంచి భారీ వర్షపాతం నమోదయింది దీనివల్ల జిల్లావ్యాప్తంగా ఇటు వ్యవసాయ అటు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఈ మేరకు అధికారులు జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా ఏఏ పంటలు నష్టపోయాయి ఎంత విస్తీర్ణంలో రైతులు పోగొట్టుకున్నారు. అనే వివరాలను ప్రాథమిక అంచనా రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో భాగంగా వ్యవసాయ పంటలు 1404 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇంటదులో వరి 524.75 ఎకరాల్లో, చెరకు 49 ఎకరాల్లో, ఆముదం రెండు ఎకరాల్లో, వేరుశనగ 561.50 ఎకరాల్లో, ఉద్దులు 96 ఎకరాల్లో, పెసలు ఐదు ఎకరాల్లో, మొక్కజొన 166.50 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ఇలా నివేదిక పంపారు.

735 ఎకరాల్లో ఉద్యాన పంటలు

అలాగే జిల్లాలో 735 ఎకరాల్లో ఉద్యానపంటలు దెబ్బ తిన్నాయి. ఇందులో 704 మంది రైతులు నష్టపోయారు. రూ. 4.67 లక్షల నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పంటల్లో వంకాయలు, కాలీఫ్లవర్ టమోటా బంగాళదుంప, పూలు మిరప, అరటి, తమలపాకు, క్యాబేజీ, పుచ్చ వంటివి ఉన్నాయి.

పుంగనూరులో తుపాన్ వలన కలిగిన పంట నష్టాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పారదర్శకంగా పంటనష్టం అంచనా

టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్

టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరినారాయణ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ మాండూస్ తుపాన్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ తెలిపారు. మంగళవారం ఉదయం తుపాన్ అనంతరం చేపట్టవలసిన చర్యలు, బాధితులకు అందించవలసిన సహాయ సహకారాలపై జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్-ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి ఆర్డీఓలు, వ్యవసాయ మరియు అనుబంధశాఖల జిల్లాస్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుపాన్ సహాయకచర్యలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి వెళ్ళే సమయంలో బాధితులకు ప్రభుత్వం సూచించిన మేరకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందించాలని తెలిపారు. వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు గ్రామ/వార్డు స్థాయిలో గల సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని పారదర్శకంగా నష్టం అంచనా గణనప్రక్రియను ఒక వారం లోపు పూర్తి చేయాలన్నారు. ఆర్డీఓలు, తహశీల్దార్లు కూడా బాధిత రైతులను పరామర్శించి పంటనష్ట అంచనా గణన ప్రక్రియలో భాగస్వామ్యులు కావాలని, దీని ద్వారా రైతుల్లో ధైర్యం నింపే అవకాశం ఉంటుందని తెలిపారు. పంటనష్ట వివరాలను ఆర్‌బికే సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. పంచాయత్ రాజ్, ఏపిఎస్ పిడిసిఎల్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ ఎస్ఈలు ఎన్యుమరేషన్ ప్రక్రియతోపాటు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాలు కొనసాగుతున్నందున వాగులు, వంకలు, చెరువుల్లో నీరు అధికంగా చేరుతోందని, మండల, గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్‌లతో సమన్వయం చేసుకుని ఇరిగేషన్ చెరువులను పర్యవేక్షించాలని తెలిపారు. నగరి ఆర్డీఓ వివరిస్తూ డివిజన్‌పరిధిలో ఎటువంటి నష్టం ఇప్పటివరకు సంభవించలేదని, చెరువులను, కుంటలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఇంకా వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. చిత్తూరు ఆర్‌డిఓ రేణుక వివరిస్తూ గుడిపాల, యాదమరి, పెనుమూరు, జి.డి.నెల్లూరు మండలాల్లో గల చెరువులలో నీటినిల్వ స్థాయిని నిరంతరం తహశీల్దార్లతో సమన్వయం చేసుకుని పర్యవేక్షిస్తున్నామన్నారు. ఐరాల మండలంలో కొన్నిచోట్ల కాజ్‌వేలలో నీరు ఎక్కువగా పారుతున్నట్లు గమనించడం జరిగిందని, అక్కడ తగిన సిబ్బందిని ఏర్పాటు చేసి జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి వివరిస్తూ నష్టపోయిన ప్రతిపంటకు సంబంధించి వివరాలను సేకరించి నివేదిక సిద్ధం చేయడం జరుగుతున్నదని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున అందించే సహాయ సహకారాలను ఆర్‌బికే అసిస్టెంట్‌ల ద్వారా తెలియపరచాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వివరిస్తూ జిల్లాలో ఇప్పటి వరకు మూడు చోట్ల మైనర్ డ్యామేజ్‌లు జరిగాయని తెలిపారు.

కాలువలు, కల్వర్టులు, చెరువుల వద్ద నిఘా

ఎటువంటి వర్ష సూచన లేకుండా భారీ వర్షాలు వస్తున్నాయని, వంకలు, వాగుల, చెరువుల వద్ద అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారయణన్ అన్నారు. మంగళవారం తుపాన్ ప్రభావంపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత రాత్రి ఎటువంటి వర్ష సూచన లేకుండా 4 మిమి వర్షం 9 మండలాలలో కురవడం జరిగిందని, ఎప్పుడు వర్షం కురుస్తుందనే విషయం తెలియడం లేదని వంకలు, వాగులు, చెరువులు మొరవ ఎప్పుడు ఎంతవేగంగా పోతాయో తెలియని పరిస్థితి ఉందని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవాహం దాటే ప్రయత్నం చేయకూడదని అన్నారు. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎట్టిపరిస్థితుల్లో కూడా ప్రమాదప్రాంతాల్లో అనుమతించ కూడదన్నారు. వరి ధాన్యం కొనుగోలు చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా చూడాలన్నారు. పంటల నష్టంను బాధ్యతగా, పారదర్శకంగా స్థానిక నాయకులతో కలసి నష్టం వివరాలు నమోదు చేయాలన్నారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

వాహన మిత్రతో ఆనందం

జిల్లాలో 24,702 మందికి లబ్ది

ప్రజాశక్తి- చిత్తూరుప్రతినిధి: **ఆటో క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం ఇస్తున్న వాహనమిత్ర పథకం ఆనందాన్ని నింపుతోంది. రూ.10వేలు వస్తుడంటంతో వారి కుటుంబాల్లో ఆనంద వెలుగులు వెలుగుతున్నాయి. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 24 వేల మందికి పైగా లబ్ధి పొందుతున్నారు.**

బతుకుదెరువు కోసం ఆటోలు, వ్యాన్లు, మ్యాక్సీ క్యాబ్‌లు నడుపుకుంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లకు అండగా వైఎస్సార్ వాహనమిత్ర పథంతో కొంత మేలు జరుగుతోంది. పాదయాత్రలో డ్రైవర్లుకు ఇచ్చిన హామీ మాట ప్రకారంగా డ్రైవర్లుకు వరసగా నాలుగో ఏడాదికి సంబంధించి జులై నెలలో విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బటన్ నొక్కి రూ.10వేల ఆర్థిక సాయాన్ని వారి బ్యాంక్ ఖాతాలకు చేయడం జరిగింది.

చిత్తూరు జిల్లాకు సంబంధించి ఈ నాలుగు సంవత్సరాలలో 24702 మంది డ్రైవర్లు బ్యాంక్ ఖాతాలకు రూ.247 కొట్లుజమ చేశారు. చిత్తూరు జిల్లాలో నాలుగో విడత వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం ద్వారా 6044 మందికి రూ.6,04,40వేలు డ్రైవర్ల బ్యాంక్ ఖాతాలకు జమయింది.

అర్హులకే లైసెన్సులు

- బసిరెడ్డి, ఉప కమీషనర్, జిల్లా రవాణా శాఖ.

రవాణా శాఖ కార్యాలయంలో సక్రమంగా డ్రైవింగ్ చేయగల వారికి ఆన్‌లైన్ ద్వారా లైసెన్సులు జారీ చేస్తున్నాం. ఇందులో ఎలాంటి రికమండేషన్లు చేయడం కుదరదని, టు వీలర్, కారు, జీపు, లారీని సక్రమంగా ట్రాక్‌లో నడుపుతారో అంతా ఆన్‌లైన్ ద్వారా రికార్డు అవుతుంది, వారికి మాత్రమే లైసెన్సులు ఇస్తున్నాం.



నా ఆటో రిపేర్ చేయించుకున్నా..

- పి.పరుశురాం, ఆటోడ్రైవర్, చిత్తూరు

నాకు ఇద్దరు పిల్లలు వున్నారు. నేను గత 5 సంవత్సరాల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. రోజుకు రూ. 5 నుండి రూ.7 వందలు వరకు బాడుగుల ద్వారా వస్తుంది. ఆ డబ్బులతో నా పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. వైయస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా వచ్చిన రూ.10 వేలుతో ఆటో మరమ్మతులు చేయించుకొనుటకు ఉపయోగించుకొన్నాను. రెండో ఏడాదిలో ఇచ్చిన డబ్బులతో ఇంజన్ పని చేయించాను.

పోలీసులకు వెన్నుదన్నుగా హోంగార్డులు

కమాండెంట్ మహేష్‌కుమార్

హోంగార్డుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విధి నిర్వహణలో పోలీసులకు వెన్నుదన్నుగా హోంగార్డులు ఉంటున్నారని కర్నూల్ రేంజ్ హోంమ్‌గార్డు కమాండెంట్ మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం పోలీస్ అతిధిగృహంలో హోంగార్డుల కవాతులో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్సిజన్ బ్యాంకు, వైఎస్ఆర్ భీమా స్కీం, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. చిత్తూరు జిల్లాలో శాంతిభద్రతల కోసం 661మంది హోంగార్డ్స్ విధులను నిర్వహిస్తున్నారని, వీరితో పాటు 227 మంది హోంగార్డ్స్ వివిధ విభాగాలలో డెప్యుటేషన్ మీద పని చేస్తున్నారని తెలిపారు. హోంగార్డ్స్ పోలీసువారితో సమానంగా కరోనా మహమ్మారిని ఎదుర్కొనడంలో ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను ఆరికట్టడంలో పోలీసులకు వెన్నుదన్నుగా ఉంటున్నారని పేర్కొన్నారు. హోంగార్డ్స్ రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు, పండుగలు, విఐపి వివిఐపి పర్యటన వంటి సందర్భాల్లో పోలీసులకు వారి సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. హోంగార్డ్స్ తమ సేవల్ని చిత్తశుద్ధితో నిర్వహించి మంచిపేరు తేవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

తుపాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో మాండూస్ తుపాన్ బాధితులను ఆదుకోవాలని సిపిఎం చిత్తూరు జిల్లాకమిటీ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో అనేక ఇళ్ళు కూలాయి, కొన్ని దెబ్బతిన్నాయన్నారు. పశు వులు, గొర్రెలు మరణించడంతో అనేక మంది నష్టపోయారని, పంట చేతికొచ్చే సమయంలో వర్షం విరుచుకుపడడంతో అప్పుచేసి పెట్టుబడి పెట్టిన రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని వీరు ఆదుకోవాలని కోరారు. మాండూస్ తుపాన్ తీరం దాటి రెండు రోజులవుతున్నా రాష్ట్రాన్ని వర్షాలు వదలలేదని, మరో వాయుగుండం రాబోతున్నట్లు వాతావరణ శాఖ చెబుతోందని, బాధితులను ఆదుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

కష్టపడి పనిచేస్తున్నాం..

నెలసరి జీతం కోసం అడుక్కొనే పరిస్థితా..

డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కష్టపడి పనిచేస్తున్నాం.. నెలవారి జీతాల కోసం అడుక్కోవాలా అంటూ ప్రభుత్వతీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫ్యాప్టో నేతృత్వంలో ఉపాధ్యాయులు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఫ్యాప్టో నాయకులు జీవి రమణ, దేవరాజులరెడ్డి మాట్లాడుతూ నవంబర్ నెల పూర్తై 13రోజులైనా ఉపాధ్యాయులకు నేటి వరకు జీతాలు జమ చేయలేదన్నారు. దీనివలన ప్రతిఉపాధ్యాయుడు ఆర్థికపరమైన ఇబ్బందులకు గురైనారని ఇప్పటివరకు ఇలాంటి విపత్కర పరిస్థితులను చవి చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలవారీ జీతాన్ని కూడా అడుక్కునే పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వంలో దాపురించిందని తెలిపారు. ఉద్యోగులకు రావలసిన జీతాలను ప్రతినెల మొదటి తారీకు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతంతో పాటు ఉద్యోగి పిఎఫ్, ఏపీజీఎల్ఐ సంపాదిత సెలవు తదితర ఆర్థికబకాయిలకు చెల్లింపులు దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్నాయని, కుటుంబ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఫ్యాప్టో సభ్యసంఘాల నాయకులు కిరణ్ కుమార్, గోపీనాథ్, మునాఫ్, హేమాద్రి, గణపతి, సుధాకర్‌రెడ్డి, మదనమోహన్ రెడ్డి, నాదముని, ముక్తార అహ్మద్, చంగల్రాయ్ మందడి, సోమశేఖర్ నాయుడు, రెహానా బేగం, ఎస్పీ బాషా, బిక్కా మురళి సుధాకర్ అన్ని సంఘాల ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

జీతాల కోసం డిఇఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అయ్యోర్లు

జనవరి కల్లా అందుబాటులోకి ఓపెన్ జిమ్

ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్, మేయర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని గంగినేని చెరువు పార్కును జనవరి 1వ తేదీ నాటికి సరికొత్తగా, మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ, మేయర్ ఎస్.అముద చెప్పారు. మంగళవారం డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డిలతో కలిసి గంగినేని చెరువు పార్కును పరిశీలించారు. పార్కులో ఏర్పాటు చేసిన నూతన ఆట వస్తువులను, చిన్నపిల్లల ఆటవిడుపు యంత్రాలను, ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించారు. కాసేపు సరదాగా ఓపెన్ జిమ్ పరికరాలతో వ్యాయామం చేశారు. ఈసందర్భంగా కమిషనర్, మేయర్ మాట్లాడుతూ... గంగినేని చెరువు పార్కును మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు పనులు వేగంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల వర్షాల వల్ల పనులు కాస్త ఆలస్యం అయ్యాయని, త్వరగా పనులు పూర్తి చేసి జనవరి 1వ తేదీ కల్లా పార్కును నగర ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో ఉన్న ఆట వస్తువులతో పాటు కొత్తగా నగర ప్రజలకు ఓపెన్ జిమ్ అందుబాటులోకి తెచ్చామన్నారు. తద్వారా నగర ప్రజలకు ఆరోగ్యకర జీవన విధానం అలవర్చుడానికి కషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మీ, డీఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న నగర మేయర్

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

4 గ్రామాల్లో సర్వేరాళ్ళు పూర్తి : జెసి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రీసర్వే పనులు వేగవంతం చేయాలని, వివిధ దశలలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని, క్లరికల్ మాడ్యూల్ తర్వాత చనిపోయిన వారికి చేయాల్సిన మ్యుటేషన్ పనులను వేగవంతం చేయాలని జాయింట్‌కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం సాయంత్రం తహశీల్దార్లు, సర్వేసిబ్బంది, గ్రామ సర్వేయర్లుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మొదటివిడతలో రీసర్వేకి సంబంధించి 135గ్రామాలకు 13నోటిఫికేషన్ విడుదల చేశారని, మరో 55 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ నిర్వహిస్తున్నారని అందులో ప్రధానంగా వి.కోట, చౌడేపల్లి, బైరెడ్డిపల్లిలలో ఎక్కువగా ఉన్నాయని వేగంగా చేయాలని, నిర్ణయించిన గడువుకాలం దగ్గరలో వుందన్నారు. మరణించిన వ్యక్తులకు సంబంధించిన మ్యుటేషన్ పనులు 2467 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. రీసర్వే డిటిలు ఈ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. 22ఎ లేయర్‌కు సంబంధించి ఈ శనివారం లోపున పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డిసి ఫర్వీన్, సర్వేసిబ్బంది పాల్గొన్నారు.

నీవా నదిని పరిశీలించిన మేయర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ, మేయర్ ఎస్.అముద, డిప్యూటీమేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డిలు మంగళవారం మధ్యాహ్నం నీవానదిలో వరద పరిస్థితిని పరిశీలించారు. తేనబండ మార్గంలోని కల్వర్టరు, వీరభద్ర కాలనీ వద్ద నీవానదిని పరిశీలించారు. గడిచిన వారం రోజులుగా వరద నియంత్రణకు చేపట్టిన చర్యలను కమిషనర్ వివరించారు. ముమ్మందు మరింత వర్షాలు కురిసినా స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. నగరపాలక ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

నీవానది నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నగర మేయర్

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

పుంగనూరులో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- పుంగనూరు: మాండూస్ తుపాన్ ప్రభావంతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు జిల్లాకలెక్టర్ ఎం. హరినారాయణ ఆదేశించారు. పుంగనూరులోని పుంగమ్మ చెరువు, రాయల్ చెరువులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. మొరవపోవుతున్న ప్రాంతాలలో అప్రమత్తంగా ఉంటూ ఆ ప్రాంతాల వద్ద నిరంతర నిఘా ఉంచాలని, మునిసిపల్, ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాండూస్ తుపాను నేపథ్యంలో చెరువులు పరిస్థితి, దెబ్బతిన్న పంటలు ఇతరత్రా అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటన చేపట్టారు. పుంగనూరులో పుంగమ్మచెరువు మొరవ పోతున్న ప్రాంతాన్ని, తాటిమాకుల పాలెం బైపాస్ రోడ్డు బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. నీటిప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఆ పరిసరప్రాంతాల్లో ఎవరు వెళ్లకుండా మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయం చేసుకొని జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. అనంతరం భీమిగానిపల్లి చెరువు మొరవపోవడంతో దెబ్బతిన్న పంటను పరిశీలించారు. పంటనష్టంకు సంబంధించి ప్రతిసెంటును అంచనా వేయడం జరుగుతుందని ఈ ప్రక్రియను పారదర్శకంగా పక్కాగా చేపట్టాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే వైద్యఆరోగ్యశాఖకు సంబంధించి సర్వేలెన్సు బందాలు ప్రజలు ఆరోగ్య స్థితిగతులపై ఇంటింటికి వెళ్లి తెలుసుకోవాలన్నారు. ప్రజలు అనారోగ్యం బారినపడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మెడికల్ఆఫీసర్‌ను ఆదేశించారు. అనంతరం రాయల్ చెరువును పరిశీలించి మొరవనీరు వెళ్లేందుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి శుభ్రం చేయాలని ఇరిగేషన్ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. మేలుపట్ల వద్ద నీటిలో మునిగిన వరిపంటను పరిశీలించారు. కలెక్టర్ వెంట రాష్ట్రజానపద కళల అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఆర్డిఓ శివయ్య, పుంగనూరు మున్సిపాలిటీ చైర్మన్ అలీమ్ బాష, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, తహశీల్దారు సీతారాం, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంపీడీఓ రాజేశ్వరి, ఇతర సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దొర చెరువును పరిశీలించిన కలెక్టర్

గంగవరం: జిల్లా పాలనాధికారి మంగళవారం మండల పరిధిలోని దొరచెరువును పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు. చెరువు ఈఏడాదిలో మూడోసారి మొరవపోతుండటంతో నీటిప్రవాహం తగ్గిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంగవరం మండలం గుంటిగల్లు గ్రామం చెరువుకు సమీపంలో ఉన్నందున కాలనీలోని కొంతమంది ఇళ్లలోకి నీరు చేరాయని.. వారిని వెంటనే పునారావాస కేంద్రానికి చేర్చాలన్నారు. ముఖ్యంగా గ్రామస్తులు చెరువులవైపు వెళ్లకూడదన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల కేంద్రానికి చేరవేయాలని, ప్రతిఒక్క అధికారి వర్షాలు తగ్గేంతవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలో తుపాన్ ప్రభావంతో చెరువులు నిండి మొరవ పోతుండటంతో జిల్లా కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం మండలంలో పర్యటించారు. మండలంలోని అతిపెద్ద చెరువు మాడిచెరువును పరిశీలించారు. ప్రమాదకర స్థాయిలో ఉన్న చెరువుల వివరాలను తహసీల్దార్ హనుమంతు నాయక్, ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాడి చెరువు ప్రమాదకరస్థాయిలో ఉండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. డీఎల్‌డీవో ఉమావాణి, ఎంపీడీవో భాస్కర్, తహసీల్దారు హనుమంతు, మండల కన్వీనర్ బాగారెడ్డితో కలిసి మాడి చెరువును పరిశీలించి పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వైస్ ఎంపీపీ జి.డి.బాబు, సర్పంచ్ హరినాథ్, నాయకులు సురేష్, ఇరిగేషన్ అధికారులు దేవేంద్ర పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: మాండూస్ తుపాన్ ప్రభావిత ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. సోమల నుంచి నంజంపేట మార్గంలోని జీడీరేవుల వంకను పరిశీలించారు. అనంతరం ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను తనిఖీ చేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న కుటుంబాల వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆవులపల్లె పంచాయతీలోని భయ్యారెడ్డిపల్లె వద్ద దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్ష బీభత్సం కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలిపారు. ఈక్రాప్ చేసిన ప్రతిఒక్క రైతును గుర్తించి ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామన్నారు.

జనరల్ న్యూస్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వి.కోట: మండల పరిధిలోని కేపాతూరు సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని కేపాతూరు సమీపంలోని గుట్టలో సుమారు 30ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహం అనుమానాస్పద స్థితిలో ఉండగా సమాచారం అందుకున్న పోలీసులకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సంఘటన స్థలంలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. మృతుడు రామకుప్పం మండలం వర్ధికుప్పానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. ఎస్సై రాంభూపాల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- పులిచెర్ల: మండలం గడ్డంవారిపల్లి పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లి-భాకరాపేట రోడ్డుకు సమీపంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై రవిప్రకాష్‌రెడ్డి తన సిబ్బందితో మంగళవారం పేకాట ఆడుతున్న స్థావరం వద్దకు చేరుకున్నారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులు కష్ణమూర్తి, సురేష్, చెంగల్రాయులు, రాధాకష్ణ, విశ్వనాథం, సయ్యద్ అల్తాఫ్, హేమంత్‌లను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.22,150లును స్వాధీనం చేసుకోవడంతో పాటు వారి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈదాడుల్లో పోలీసులు రషీద్, విశ్వనాథం, శివకుమార్, సురేష్, ఫైజుల్లా పాల్గొన్నారు.

వైసీపీ సీనియర్ నాయకుడి మృతి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరులో వైసీపీ సీనియర్ నాయకుడు మాజీ డీలర్ సుబ్రహ్మణ్యం తమ్ముడు గురుస్వామి సోమవారం రాత్రి మృతిచెందారు. మతుడు కోగిలేరు గ్రామ సమీపంలోని శ్రీ జలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజారిగా ఉన్నారు. తిరుపతిలో ఓఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రెడ్డెప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ రమేష్‌బాబు, ఎంపీటీసీ పరందామ, మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు శివశంకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం వారితో ఉన్నారు.

స్కిల్‌హబ్‌ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం: నిరుద్యోగ యువతీ,యువకులు రాష్ట్రప్రభుత్వం చేపట్టే స్కిల్‌హబ్‌ను సద్వినియోగం చేసుకుని ఉద్యోగావకాశాలు పొందాలని ఎంపీడీఓ మోహన్ మురళీ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పారిశ్రామిక కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన స్కిల్హాబ్లో ఎలక్ట్రిషన్ డెమోస్టిక్ సొల్యూషన్, అర్హత, లేదా ఎస్ఎస్సీ, ఐటీఐ, ఇంటర్మీడియట్, లేదా ఏదేని డిగ్రీ కలిగి 18-35 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీయువకులు శిక్షణ పొందాలని సూచించారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు స్కిన్ఇండియా సర్టిఫికేషన్ అలాగే కంపెనీలలో ఉద్యోగా అవకాశాలు పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కొరకు 8142509017 నంబర్ను సంప్రదించాలని కోరారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- పులిచెర్ల: అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కల్లూరు సచివాలయం-1ను సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించారు. తుపాను అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంటువ్యాధులు ప్రబలకుండా అందించాల్సిన వైద్యసేవలు, పారిశుద్ధ్య చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయుష్మాన్ సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం జడ్పీ విశ్రాంతి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అమానుల్లా, సచివాలయ సిబ్బంది భరత్, పూజిత, జరీనా, నిరోషా, రోహిణి, శ్రీనివాసులు, లావణ్య పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి అన్నారు మంగళవారం మండలంలోని బంగారు పాల్యం రాగిమనిపెంట కేరమంద టేకు మంద పంచాయతీలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండాస్ తుఫాన్ వలన గ్రామాల్లో వ్యర్థాలను తొలగించాలని వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు శంకరయ్య అవంతి మనోజ్ చంగల్ రాయలు పాల్గొన్నారు.

యాదమరి: కలుషిత నీరు తాగడంతో అతిసారం వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని.. ప్రజలను అప్రమత్తం చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కీనాటంపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో నీరు కలుషితం కావచ్చన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీరే తాగాలని వారికి అవగాహన కల్పించాలన్నారు. కలుషిత నీరు తాగడంతో వాంతులు.. విరోచనాల బారిన పడుతారని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దిల్షాద్, మహిళా ఆరోగ్య కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్త అంజలి తదితరులు పాల్గొన్నారు.

విడవని ముసురు...!

- స్తంభించిన జనజీవనం - వర్షాలకు తల్లడిల్లిన విద్యార్థులు

ప్రజాశక్తి- వీకోట: మండల పరిధిలో గత వారం రోజులుగా మాండూస్ తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేని ముసురు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించిపోయింది. గ్రామీణప్రాంతాల్లో రైతులు పండించిన పంటలకు వర్షాలు అపారనష్టాన్ని కలిగించాయి. ముఖ్యంగా టమోటా, బంగాళదుంప, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అధిక ధరలతో కొనుగోలు చేసిన విత్తనాలు మొలకదశలోనే కుళ్లిపోయి రైతులను నట్టేట ముంచింది. కోతకు వచ్చిన వరి నేలకొరకడంతో మొలకలు వచ్చాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు మేతలేక పాడి రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. దీనితో పాల దిగుబడులు తగ్గాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గొర్రెలు, మేకల కాపర్లు జీవాలను మేత బైళ్ళకు తరలించలేక అల్లాడిపోతున్నారు. చలి తీవ్రత ఎక్కువ కావడంతో కోళ్లు మత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీడవని జడివానలో సైతం పాఠశాలలకు సెలవులు ప్రకటించకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు బురదమయం కావడంతో పాటుపలుచోట్ల రోడ్లుకోతకు గురికావడంతో రాకపోకలకు ప్రజలు తీవ్రఅవస్థలు పడుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సర్పంచులు కార్యదర్శులు ప్రత్యేకదష్టి సారించి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలను వెంటనే పంపండి

రెండు రోజుల్లో పెప్స్ భూసేకరణ ప్రతిపాదనలు: జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో చిన్నతరహా ప్రాజెక్టులు, మధ్యతరహా ప్రాజెక్టులు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ కోసం ఎక్స్రేషియా ప్రతిపాదనలను వెంటనే పంపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలమనేరు ఆర్డీఓ శివయ్య, చిత్తూరు ఆర్డీవో రేణుకలతోపాటు పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, రొంపిచెర్ల, కుప్పం, గుడిపల్లి తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలో రిజర్వాయర్లు, చిన్నతరహా ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేస్తున్నారని దీని కోసం ఎక్స్రేషియా ప్రతిపాదనలను వెంటనే పంపాలని ఇప్పటికే డిఎల్ఎన్సి సమావేశం నిర్వహించడం జరిగిందని, ఎక్స్రేషియా ప్రతిపాదనలను వెంటనే పంపితే నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పుంగనూరు మండలంలో ఇళ్ల స్థలాల కోసం రాగానీ పల్లి వద్ద భూ సేకరణ పూర్తి చేయాలని, కుప్పం, గుడిపల్లిలో రైల్వే నిర్మాణం కోసం భూసేకరణ చేయాలని, హంద్రీనీవా కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి భూసేకరణ పూర్తిచేసి పనులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

జాతీయ చిత్రకళా పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- యాదమరి: ఐదవ జాతీయస్థాయిలో జరిగిన చిత్రకళాపోటీల్లో యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గతనెల చిత్రకళా నిలయం చోడవరం విశాఖ జిల్లాలో ఐదవ జాతీయ చిత్రకళా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యాదమరి ఉన్నత పాఠశాలలో చదువుతున్న రేష్మా 7వ తరగతి, ఫాతిమా పీర్దోస్ 8వ తరగతి, చరణ్ 8వ తరగతి, గుణ సాహితీ 8వ తరగతి, రమ్య 10వ తరగతి విద్యార్థులు బంగారు పథకాలు గెలుపొందారు. విద్యార్థులు బంగారు పతకాలు సాధించడానికి కషి చేసిన ఆర్ట్ మాస్టర్ దామోదరాచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారాం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. చిత్రకళా సంస్థ వ్యవస్థాపకులు, కార్యదర్శి బొడ్డేట సూర్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లోని సజనాత్మకశక్తిని వెలికితీయటానికి వారిలో ఏకాగ్రతను పెంచడానికి మనోవికాసానికి దోహదపడే చిత్రకళ పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- యాదమరి: గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని మంగళవారం యాదమరి తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్వోలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవిచంద్ర, శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆదేశాల మేరకు యాదమరి మండలం తహసీల్దారు వారి కార్యాలయం వద్ద గ్రామరెవెన్యూ అధికారుల ప్రధానమైన 12 డిమాండ్లపై భోజన విరామ సమయంలో తహసీల్దారు వారి కార్యాలయం వద్ద నిరసనలు తెలిపారు. అనంతరం తమ డిమాండ్లను పరిష్కరించాలని తహసీల్దారు చిట్టిబాబుకు వీఆర్వోల సంఘం తరఫున వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యాదమరి వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రవిచంద్రన్, ప్రధాన కార్యదర్శి కేఆర్ శ్రీనాథ్‌రెడ్డి, వీఆర్వోలు యోగానందం, భాస్కర్, సుబ్రహ్మణ్యం, భూపాలు, రూపేష్, దేశయ్య, ఉమా, మాధవీలత, రేఖ, బీజాక్షి గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం

జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి- రొంపిచెర్ల: మాండూస్ తుపాన్ కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ పంటలకు సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మోటుమల్లెల, బోడిపాటి వారిపల్లి గ్రామ పంచాయతీలలో మంగళవారం పంటలను పరిశీలించారు. ఓ మొక్క రూ.1.20 వంతున ఇస్తుండగా.. సబ్సిడీతో కేవలం మొక్క 20 పైసలకు సరఫరా చేస్తామని తెలిపారు. టమాటా, మిరప, బంగాళాదుంపకు హెక్టార్‌కు రూ.15వేలు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేస్తామన్నారు. తమలపాకు తోటకు సెంటు భూమికి రూ.300 చొప్పున, ఎకరాకు రూ.30 వేలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సహాయకులు వెంకటరమణ నాయక్, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

ఐరాల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి మంగళవారం ఐరాల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మాట్లాడుతూ పోలీసుల ఉద్యోగ భాద్యతలను వివరించడంతో పాటు ప్రజలతో ఎలా మెలగాలి అనే దానిపై సూచించారు. మండలాలలో జరిగే భూతగాదాలు గురించి సమాచారం తెలుసుకొని వెంటనే తెలపాలన్నారు. అలాగే మహిళల పై జరిగే నేరాలపై, సైబర్ క్రైమ్ గురించి ప్రజలకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పించి ప్రజలను చైతన్య పరచాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, స్టేషన్‌లో వాహనాలను ఒకనెలలో వాటిని డిస్పోసే చేయాలన్నారు. అనంతరం స్టేషన్ రికార్డ్సును క్షుణ్ణంగా పరిశీలించి సమీక్షించారు. గత మూడు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షం కారణంగా ఐరాల లోని వాగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్న ప్రాంతాన్ని డిఎస్పి స్వయంగా ప్రదేశాన్ని సందర్శించారు. పోలీస్ అధికారులకు తగిన సూచనలు చేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంగటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు లోతట్టు గ్రామాలలో సందర్శించాలని ఆదేశాలిచ్చారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న డిఎస్పి

పనులు వేగవంతం.. బిల్లులు ఆలస్యం..!

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు: పంచాయతీల్లో పనులు వేగవంతంగా చేయాలని అధికారులు తమపై ఒత్తిడి చేస్తారని.. పనులు పూర్తయిన తర్వాత బిల్లులు మాత్రం ఆలస్యం చేస్తున్నారని సర్పంచులు ఏకాంబరం, కష్ణనాయుడు, రామాంజులు, నీలావతి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ హరిబాబు మాట్లాడుతూ మండలంలో వివిధ అభివద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన శిలాఫలకాలు ఏర్పాటు చేసినప్పుడు వైస్ ఎంపీపీలుగా తమ పేర్లు పెట్టడం లేదని ఎంపీడీవో శ్రీదేవితో హరిబాబు వాదనకు దిగారు. దీంతో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రోటోకాల్ మేరకు కాంట్రాక్టర్లు సంబంధిత జిల్లా అధికారులకు పేర్లు పంపించినప్పుడు వారే ఎంపీపీ పేరు ఉన్నప్పుడు వైస్ ఎంపీపీ పేర్లు పెట్టుకోకపోయినా ఫర్వాలేదని చెప్పారని పేర్కొన్నారు. ఇందులో తన వ్యక్తిగతంగా ఎటువంటి అభిప్రాయం లేదని సమాధానం ఇచ్చారు. కలిజవేడు సర్పంచ్ నీలావతి మాట్లాడుతూ కె.వెంకటాపురం, బొమ్మవారిపల్లి రోడ్డు చాలా అధ్వానంగా ఉన్నాయని గుంతలనైనా పూడ్చాలని కోరారు. పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగా పశువుల సంత ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మీప్రియ , ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దారు ఇన్నునాదన్, ఏఈలు రాజా, గాయత్రి, సుగుణాకరరావు, ఎంఈవో రాజేంద్రన్, ఎట్టేరి వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు, వైద్యులు దివ్య, ప్రశాంత్, ఏపీవో శ్రీనివాసులు, ఏపీఎం చిరంజీవి, ఐసీడీఎస్ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి

సంక్షిప్త వార్తలు

15న పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 15వ తేది ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక గంగినేని చెరువు వద్ద గల శ్రీరాములు విగ్రహానికి ఘనంగా నివాళ్ళు అర్పించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో బౌద్ధధమ్మ సంఘం గౌరవాధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సహదేవనాయుడు తెలిపారు. పట్టణంలోని కవులు, కళకారులు, సంఘ సేవకులు, సాహితీవృత్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలలో 1984లో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు చంద్రశేఖర్ నాయుడు, కనకాచారి, హరికష్ణ ప్రస్తుత పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. యాదమరి ఉన్నత పాఠశాలలో 180మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు రాయనుండగా.. వారికి అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. గత ఏడేళ్లుగా విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందిస్తున్నారని ప్రధానోపాధ్యాయులు రాజా తెలిపారు. పాఠశాలలో 540 పైన మార్కులు విద్యార్థులకు రూ.1116 నగదు ఇవ్వనున్నట్లు పీఆర్టీయూ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, పాఠశాల పూర్వ విద్యార్థి కనకాచారి హామీ ఇచ్చారు. ఎంఈవో రుక్మిణమ్మ, పీఆర్‌టీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, టీచర్స్ కష్ణారెడ్డి, దామోదర్‌ఆచారి పాల్గొన్నారు.

నియోజకవర్గ వైసీపీ యువత అధ్యక్షులుగా రవి

గుడిపల్లి: మండలానికి చెందిన వైసీపీ నాయకులు రవిని కుప్పం నియోజకవర్గం వైసీపీ యువత అధ్యక్షులుగా నియమించినట్లు ఆ పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంగా పదవిని అప్పగించిన ఎమ్మెల్సీ భరత్, గుడిపల్లి మండల జడ్పీటీసీ కష్ణమూర్తిలకు, నియోజకవర్గ వైసీపీ నాయకులకు, గుడిపల్లి మండల వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు వాహనాల వేలం

బైరెడ్డిపల్లి: మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ రెండు ఆటోలు, 6 ద్విచక్ర వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం గంగవరం పోలీస్ స్టేషన్‌లో 0.గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై వెంకట నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.వెయ్యి ధరావతు చెల్లించాలని కోరారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి: ఎంపిపి

పాలసముద్రం : మండలపరిధిలోని అన్నిగ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీపీ శ్యామల, పిహెచ్ చైర్మన్ శివప్రకాష్ రాజు తెలిపారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య సిబ్బంది, గ్రీస్ అంబాసిడర్‌లో వారివారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి వర్షపునీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమలు నివారించడానికి సాయంత్రం మలాథిన్ మందులు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫ్యాన్లు వితరణ

బైరెడ్డిపల్లి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసేందుకు మహతి ఫౌండేషన్ చైర్మన్ ఎన్ఆర్ఐ నాగరాజు మంగళవారం ఐదు సీలింగ్ ఫ్యాన్లను ఉచితంగా తహసీల్దార్ కుమారస్వామికి అందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్లలో ఉచిత వైద్యసేవలు

రొంపిచెర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజ ఆదేశాల మేరకు రొంపిచెర్ల గ్రామ సచివాలయం-2 పరిధిలో మంగళశారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, ఇతర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో కార్యదర్శి రవిచంద్రబాబు, ఎంఎల్‌హెచ్‌పీ గీత, ఏఎన్ఎం వెంకటేశ్వరి, మహిళా పోలీస్ రెడ్డిప్రశాంతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాం కాశి కుటుంబానికి ఆర్థిక సాయం

కార్వేటినగరం: అనారోగ్యంతో మృతిచెందిన శివరాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుందని శ్రీరంగరాజపురం ఏఎంసీ చైర్మన్ ఇంజం క్రిష్ణయాదవు తెలపారు. మంగళవారం డీఎంపురం పరిధిలోని కొత్తదేరాకండిగ గ్రామంలో అనారోగ్యంతో మతిచెందిన శివరాంకాశి కుటుంబానికి వైఎస్సార్ భీమా పథకం ద్వారా రూ.10వేలు ఆర్థిక సహాయంను కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్సిపి పార్టీ అధ్యక్షులు శేఖర్, కార్యదర్శి గోపి, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు సాయం

ప్రజాశక్తి- కార్వేటినగరం: తుపాన్ బాధిత కుటుంబాలను ప్రతిఒక్కరిని ప్రభుత్వం ఆదుకుంటుందని మండల తహశీల్దార్ అమర్నాథ్ తెలిపారు. మంగళవారం కార్వేటినగరం పరిధిలోని సుద్దగుంట గ్రామంలో తుపాన్ నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఆర్.సుబ్రమణ్యం, మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, ఎంపీడీఓ మోహన మురళీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని దండపల్లి పంచాయతీ ఎగువ వేమనపల్లి గ్రామంలో తుపాన్ బాధితులకు ఉన్నత పాఠశాల తరలించి గత మూడు రోజులుగా మౌలిక వసతులు కల్పించారు. వీరికి మంగళవారం తహశీల్దార్ మురళి ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున నగదు పంపిణీ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

పాలసముద్రం: మాండూస్ తుపాన్ కారణంగా నిరాశ్రయులైన ఎస్టి కాలనీ ప్రజలకు మంగళవారం తహశీల్దార్ బాబు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే ప్రతి కుటుంబానికి రూ.2వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈకార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, డీలర్, ఎస్టికాలనీ గ్రామస్తులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ కేశవులుకు శుభాకాంక్షలు

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని చెప్పిడిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జడ్పీటీసీ కేశవులుకు పుట్టినరోజు కావడంతో సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సుజాత, మోహన్ ఇంటి వద్దకు చేరుకొని కేకు కత్తిరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన హేమంత్ కుమార్‌రెడ్డి

పలమనేరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ని ఢిల్లీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు అభివద్ధి పనులపై విన్నవించారు.

సీపీఎం నాయకుల సాయం..

తల్లీబిడ్డలు ఒక్కటయ్యారు..!

పలమనేరు: పట్టణ పరిధిలోని సిల్క్‌ఫారం వద్దకు 15 ఏళ్ల క్రితం చేరుకున్న మానసికస్థితి సక్రమంగా లేని ఓ వృద్ధాప్య మహిళను సీపీఎం నాయకుల సాయంతో మంగళవారం తన కుటుంబానికి చేర్చారు. కొన్నాళ్లుగా ఆమె మానసిక స్థితి మెరుగుపడి తన పేరు లక్ష్మమ్మ అని.. కుటుంబ సభ్యులు, పిల్లలున్నారని.. అనంతపురం జిల్లా కరూర్ మండలం గెంజిగుంట గ్రామంలోని తన బిడ్డల వద్దకు చేర్చాలని కోరింది. సీపీఎం నాయకుల సాయంతో కుమార్తె వెంకట్‌లక్ష్మికి సమాచారం అందించి ఆమెను బిడ్డకు అప్పగించారు. నాయకుల గిరిధర్ గుప్తా, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ఐద్వా నాయకురాలు జయంతి, కైరునిసా, రాజా, శాంతమ్మ, కాలనీవాసులు ఆధ్వర్యంలో లక్ష్మమ్మను కూతురు వెంకటలక్ష్మికి అప్పగించి సాయం చేశారు. వీరికి వెంకటలక్ష్మీ కతజ్ఞతలు తెలిపారు.